కూరగాయల ధరలు పైపైకి

సెంచరీ కొట్టిన పచ్చిమిర్చి, బీన్స్, టమాట
- అదే కోవలో మిగతా కూరగాయల ధరలు
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు



మార్కెట్‌లో విక్రయిస్తున్న కూరగాయలు

నంద్యాల(న్యూటౌన్): కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటా వర్షాకాలంలో సహజంగా కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. అయితే ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు ఆకాశాన్నంటాయి. రైతు బజార్‌కు రూ.500 తీసుకెళ్లితే చేతి సంచి కూడా నిండటం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

రోజురోజుకు పెరుగుతున్న ధరలు

పది రోజుల కిందట రూ.75 ఉన్న కిలో బీన్స్ ధర ప్రస్తుతం రూ.110కి చేరింది. ఇదే తరహాలో నాటు కాకరకాయ, చిక్కుడుకాయలు కిలో రూ.70 పలుకుతున్నాయి. ఇక క్యాప్సికం కిలో రూ.80 ఉండగా, అలసందలు, బీరకాయలు, క్యారెట్, మునక్కాయల ధరలు కిలో రూ.60కి చేరాయి. అలాగే మట్టికాయలు, కాలీఫ్లవర్, ముల్లంగి, కీరకాయలు కూడా కిలో రూ.40 పైనే ధర పలుకుతున్నాయి. ప్రతి కూరలో వాడే టమాట ధర మార్కెట్‌లో కిలో రూ.100 పలుకుతుంది.

మండుతున్న మిరపకాయ..

గత నెల రోజుల నుంచి పచ్చి మిరపకాయల ధర తగ్గడమే లేదు. తొలుత కిలో రూ.25 నుంచి ప్రారంభమై తరువాత కిలో రూ.40 ఆపై రూ.100కు చేరి సెంచరీ కొట్టింది. కనీసం పచ్చడి మెతుకులు తిందామన్న మిరపకాయ ధర మండుతుంది. ఇదివరకు కిలో పచ్చిమిర్చి తీసుకునే వారు 250 గ్రాములతో సరిపెట్టుకుంటున్నారు. అలాగే గత రెండు నెలల నుంచి అల్లం ధర ఘాటు తగ్గడమే లేదు. కిలో రూ. 180 నుంచి రూ.200 వరకు ధర పలుకుతుంది. ముందు వర్షాలు ఎక్కువగా కురిస్తే కూరగాయలు కొనే పరిస్థితి ఉండదేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అల్లం

ఏం తినాలో తెలియడం లేదు



రోజురోజుకు కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. టమాట, పచ్చిమిరప కాయలు కొనలేని పరిస్థితి ఉంది. ఈ రెండు ధరలు తక్కువగా ఉంటే పచ్చడన్నం తినేందుకు వీలుంటుంది. అలాంటివే మార్కెట్‌లో ఎక్కువ ధర పలుకుతుండటంతో మాలాంటి సామాన్యలకు కొనడం భారమవుతుంది.

–సుజాత, నంద్యాల

ధరలను తగ్గించాలి



గత నెల రోజుల నుంచి బీన్స్ ధర తగ్గడం లేదు. మొన్నటి వరకు కిలో రూ.100 కూడా పలికింది. ఇప్పుడేమో కాసింత తగ్గి కిలో రూ.90 ఉంది. అలాగే క్యాప్సికం కూడా కిలో రూ.70 ఉంది. అల్లం ధర కూడా తగ్గలేదు. మిగిలిన కూరగాయల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరకు కూరగాయాలు అందించాలి.

–జయన్న, బిల్లలాపురం

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ప్రాథమికంగా రీడింగ్, రైటింగ్ స్కిల్స్‌ను అభివృద్ధి చేయాలని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, సరస్వశిక్ష అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ లలితమ్మ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో టీచ్ టూల్స్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, సీఆర్‌ఎంపీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. 9 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఇక్కడ పొందిన శిక్షణను తప్పని సరిగా పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పరీక్షల్లో పాసయ్యే విధంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు బ్రహ్మంనాయక్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆడపిల్లలకు రక్షణ ఏదీ?



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో చిన్నారులు, ఆడపిల్లలపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సన్నల అనూష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు, చిన్నారులకు రక్షణ కరువైందన్నారు. కామాంధులకు బలవుతున్న పసి ప్రాణాలను కాపాడలేని ప్రభుత్వం ప్రజలకు ఏం మేలు చేస్తుందని మండిపడ్డారు. ముచ్చుమర్రిలో బాలికను అత్యాచారం చేసి హతమార్చిన నిందితులను నేటికి సర్కారు పట్టుకోలేదన్నారు. వెంటనే ఈ కేసును ఛేదించి నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

దొర్నిపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సురేష్ సూచించారు. శనివారం దొర్నిపాడు శివారులోని కేసీ కెనాల్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. 30 వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువ పత్రాలులేని వాటికి జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో హెల్మెట్ తలకు ఎంతో రక్షణ ఇస్తుందన్నారు. అలాగే చిన్నపిల్లలకు తల్లిదండ్రులు బైక్‌లు ఇవ్వరాదన్నారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంటలను రక్షించుకోండి

రుద్రవరం: ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున రైతులు పంటల రక్షణకు మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. శనివారం ఆయన స్థానిక ఆర్‌బీకేలో రైతులు, వీఏఏలతో మాట్లాడారు. వానలకు మొక్కజొన్న, కంది, మినుము, వేరుశనగ, పత్తి, ఉల్లి, పసుపు, తదితర పంట పొలాల్లో నీరు అధికంగా నిలిచి వేరుకుళ్లు, మచ్చ తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ముందుగా పొలాల్లో నీరు నిల్వ లేకుండా బయటకు పారద్రోలాలన్నారు. తర్వాత యూరియా, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ చల్లాలని సూచించారు. తెగుళ్లు సోకిన మొక్కలను సైతం తొలగించాలని చెప్పారు.

గేదెలను తీసుకెళ్లారు

దొర్నిపాడు: తప్పిపోయి చాకరాజువేముల గ్రామం బండెల దొడ్డిలో పదిరోజులుగా ఉన్న గేదెలను శనివారం వాటి యజమాని తీసుకెళ్లాడు. శనివారం 'ఈ గేదెలు ఎవరివో ఆధారాలు చూపించి తీసుకెళ్లండి' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిని చూసిన రైతు తలారి రాముడు ఆధారాలతో చాకరాజువేముల గ్రామ పెద్దలను కలిశారు. వారు విచారించి బండెల కావలి వాళ్ల సమక్షంలో రైతుకు గేదెలను అప్పగించారు. రూ.3లక్షల విలువ చేసే జీవాలను 10 రోజుల పాటు సురక్షితంగా కాపాడి అప్పగించినందుకు ఆ గ్రామ పెద్దలకు రాముడు కృతజ్ఞతలు తెలిపారు.

కుష్టు నిర్ధారణ సర్వేకు సహకరించండి



తిప్పారెడ్డిపల్లెలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రుద్రవరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వేకు ప్రజలు సహకరించాలని నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు కోరారు. మండలంలోని తిప్పారెడ్డిపల్లెలో శనివారం ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో కలిసి వ్యాధి నిర్ధారణ సర్వే చేపట్టారు. చర్మంపై స్పర్శ లేని రాగిరంగు మచ్చలు ఏర్పడటం, చర్మం పొడిగా ఉండటం, కనుబొమ్మలు, కనురెప్పల మీది వెంట్రుకలు రాలడం, చేతుల్లో నుంచి వస్తువులు జారి పడిపోవడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం తదితరవి ఈ వ్యాధి లక్షణాలని, ఎవరికైనా ఉంటే తమకు తెలియజేయాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే నివారణకు తగిన మందులు ఇంటి వద్దే అందిస్తామని చెప్పారు.

నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార తయారీలో శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి హెచ్చరించారు. శనివారం హోటళ్లు, రెస్టారెంట్లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ముఖ్యంగా కిచెన్ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మాంసాహార వంటలను నిల్వ చేయకూడదన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

'టిడ్కో'లో మౌలిక వసతులు కల్పించండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్ పట్టణాల్లోని టిడ్కో కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులు ఇళ్లలో చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి టిడ్కో అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె తన చాంబరులో గృహ నిర్మాణాల ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ఎస్‌ఆర్‌బీసీ టిడ్కో కాలనీలో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాటిలో లబ్ధిదారులు చేరేలా చూడాలన్నారు. అయ్యలూరు మెట్ట టిడ్కో కాలనీలో 2,272 గృహాలు నిర్మించారని, అయితే, అక్కడ నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. నందమూరి నగర్‌లో 720, డోన్ పట్టణంలో 288 టిడ్కో గృహాలు నిర్మించినట్లు తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలో 1392 టిడ్కో గృహాలకు గాను 950 మంది లబ్ధిదారులు చేరారని మిగిలిన వారు కూడ చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి...

318 లేఅవుట్‌లలో వివిధ దశల్లో ఉన్న గృహాల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డిసెంబర్ 31 నాటికి కేటాయించిన 14,899 గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ స్వరాజ్ యోజన కింద సొంత స్థలాల్లో చేపట్టిన 12,655 గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాలపై అధికారులు ప్రతిరోజు సమీక్షించి పురోగతి పరిశీలించాలన్నారు. అలాగే లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు, ఇటుక తదితర మెటీరియల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమావేశంలో టిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఈఈ శ్రీహరిగోపాల్ పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకుడు ఏసురత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీతో జతకట్టిన చంద్రబాబు భవిష్యత్తులో ఎంత మేర రాణిస్తారో చూడాల్సి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాల వల్ల మైనార్టీలు నష్టపోతున్నారన్నారు మతోన్మాద పార్టీ అయిన బీజేపీని జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ సమర్థిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సూపర్ 6 పథకాలు అమలుకై తగిన ప్రణాళికలు ప్రకటించాలన్నారు. పోలవరం, రాజధాని అమరావతి చుట్టూ రాజకీయాలు సాగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆకలి చావులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నాగరాజు, నాగేశ్వరరావు, నరసింహ, రైతు సంఘం నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, రణధీర్, శ్రీకాంత్, రత్నమయ్య, సుధాకర్, సామన్న, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

బాలిక హత్య, లాకప్‌డెత్‌లను సీబీసీఐడీకి అప్పగించాలి



మాట్లాడుతున్న లబ్బి వెంకటస్వామి

బొమ్మలసత్రం: ముచ్చుమర్రిలో బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసును, నంద్యాల సీసీఎస్ పోలీసుస్టేషన్‌లో లాకప్‌డెత్‌ను సీబీసీఐడీకి అప్పగించాలని, అప్పుడే వాస్తవాలు వెలుగు చూస్తాయని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన హుస్సేని మృతదేహాన్ని పరిశీలించేందుకు స్థానిక సర్వజన ఆసుపత్రికి లబ్బి వచ్చారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7 వ తేదీన అదృశ్యమైన బాలిక హత్యకు గురైందన్నారు. బాధిత కుటుంబానికి మంత్రులు రూ. 10 లక్షలు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఈ ఘటన వెనుక ఉన్న ప్రధాన నిందితులు ఎవరో ఇప్పటి వరకు గుర్తించలేదన్నారు.

23 నుంచి ఆధార్ క్యాంప్‌లు

రుద్రవరం: మండలంలో ఈ నెల 23 నుంచి ఏర్పాటు చేసే ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పర్యవేక్షకులు వరలక్ష్మి తెలిపారు.శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 23, 24 తేదీల్లో కోట కొండ, ఆర్.నాగులవరం గ్రామ సచివాలయాల్లో, 25,26 తేదీల్లో ఎల్లావత్తుల, ఆలమూరు, 27న శ్రీరంగాపురం, రుద్రవరం-1,2,3 గ్రామ సచివాలయాల్లో క్యాంప్‌లు ఉంటాయన్నారు. ఆయా తేదీల్లో ఆధార్‌లో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవాలని సూచించారు.

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

చాగలమర్రి: అర్హులైన రైతులు కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని చాగలమర్రి మండల వ్యవసాయాధికారి రంగసేతాజీ తెలిపారు. శనివారం పెద్ద బోధనం గ్రామంలో కౌలు కార్డులు పొందడంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలు కార్డు ఉంటే పంట నష్టపోయినప్పుడు పరిహారం లభిస్తుందన్నారు. అలాగే బ్యాంకుల్లో రుణాలు ఇస్తారన్నారు. అవసరమైన వారు స్థానిక వ్యవసాయ సిబ్బందిని కలిసి దరఖాస్తులు సమర్పించాలన్నారు.

సంక్షిప్తం

చాపిరేవుల సర్పంచ్‌గా డీఎన్‌రాజు

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని చాపిరేవుల గ్రామ సర్పంచ్‌గా డీఎన్ రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్న బోయరేవుల దేవి అనారోగ్య కారణాలతో పదవికి రాజీనామా చేశారు. దీంతో డీపీఓ మంజులవాణి ఉప సర్పంచ్‌గా ఉన్న రాజుకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మద్యం షాపు మార్చాలి

నంద్యాల(అర్బన్): మండల మేజర్ పంచాయతీ కానాల గ్రామం కోనేట్ల కొమ్మ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపును మరో ప్రాంతానికి మార్చాలని రైతులు కోరుతున్నారు. అటు దర్గా, ఇటు బుగ్గరామేశ్వర ఆలయం మధ్యలో మద్యం షాపు ఉంది. ఖాళీ మద్యం బాటిళ్లను మందు బాబులు రోడ్డుపై, పక్కనున్న సాగునీటి కాల్వల్లో వేస్తున్నారు. దీనికి తోడు ఆలయాలకు వచ్చే భక్తులు సైతం ఇబ్బంది పడుతున్నారని, అధికారులు స్పందించి మద్యం షాపు మార్పునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్‌వ్యాధులపై అవగాహన

చాగలమర్రి: వర్షాకాలంలో ప్రబలే డెంగీ, డయేరియా, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి తస్లిమా సుల్తానా అన్నారు. శనివారం ఆమె చిన్నవంగలి గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ నర్మద, ఏఎన్‌ఎం నూర్జహాన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండాలి

నంద్యాల(అర్బన్): ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మహేశ్వరమ్మ వెనుకబడిన వర్గాలకు అండగా నిలవాలని ఏపీ దళిత గిరిజన సమాఖ్య రాయలసీమ అధ్యక్షుడు మధుబాబు కోరారు. మహేశ్వరమ్మను పట్టణంలోని దేవనగర్‌లో శనివారం పలు సంఘాల ప్రతినిధులు కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు చిన్నమ్మ, బాయికాటి ప్రహ్లాద, సుధాకర్, శివరామిరెడ్డి, స్వామినాయక్, తదితరులు ఉన్నారు.

ఈరోజు

శ్రీగౌస్‌పీర్‌షా ఖాద్రీ గంధం

చాగలమర్రి: చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో వెలసిన శ్రీగౌస్‌పీర్‌షా ఖాద్రీ స్వామి గంథోత్సవం నేడు జరుగుతుందని పీఠాధిపతి శ్రీలాలుమియ్యాషా ఖాద్రీ తెలిపారు. 22వ తేదీ సోమవారం ఉరుసు ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకోవాలని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పోలీస్ డైరీ

పేకాటరాయుళ్ల అరెస్టు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న మోహన్, నాగేశ్వరరావు, అల్లిసా, దొరస్వామి, అంజి, హరినాథ్ అనే అరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,180 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఆధ్యాత్మికం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ అభయాంజనేయస్వామికి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మి నరసింహ కంబగిరిస్వామికి భక్తులు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మలు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బాబా ఆలయాలు ముస్తాబు



విద్యుత్‌దీపాలంకరణలో సాయిబాబా గుడి

నంద్యాల(వ్యవసాయం): గురుపౌర్ణమికి పట్టణంలోని బాబా ఆలయాలు ముస్తాబయ్యాయి. నాగులకుంట రోడ్డులోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో భారీ ఏర్పాట్లు చేశారు. నేడు ఇక్కడికి భక్తులు వేల సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం బాబా గ్రామోత్సవం జరుగుతుంది. బొమ్మలసత్రం, అయ్యలూరిమెట్ట, జంబులాపరమేశ్వరి దేవాలయం వద్ద ఉన్న విశ్వనగర్ తదితర ప్రాంతాల్లోని బాబా ఆలయాల్లో నేడు గురుపౌర్ణమి పండుగకు ఏర్పాట్లు చేశారు.

గురుపౌర్ణమికి ముస్తాబు

శిరివెళ్ల: గురు పౌర్ణమి వేడుకలకు సాయిబాబా దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. శిరివెళ్ల, వీరారెడ్డిపల్లె, వెంకటాపురం, రాజనగరంలలో ఉన్న ఆలయాలను భక్తులు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. వేడుకలకు హాజరయ్యే భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామి జార్తలు



మౌలాలిస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: మౌలాలి స్వామి జార్తలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామికి జెండాలు, పూల సూసికాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక స్వామి పీరును గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. జార్తల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ నాగార్జునరెడ్డి చర్యలు తీసుకున్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ వర్కర్లకు రూ.26వేలు వేతనం ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు భారంగా మారిన యాప్‌ను రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు సొంత భవనాలు నిర్మించి ప్రభుత్వమే ఉచిత గ్యాస్ ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరిపి అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సుంకయ్య, జిల్లా అధ్యక్షులుగా వసుంధరదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రకళ, ఉపాధ్యక్షులుగా స్వర్ణలత, జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా జులేఖ, సీతామహాలక్ష్మి, సహాయ కార్యదర్శిగా జయలక్ష్మి, కోశాధికారిగా ఎస్తేరమ్మతో పాటు 35మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మొదలైన పత్తి విత్తు



ఆర్.పాంపల్లెలో పత్తి విత్తనాలు నాటుతున్న దృశ్యం

ఉయ్యాలవాడ : రెండురోజులుగా కురుస్తున్న వానలకు మండలంలో పత్తి సాగు మొదలైంది. మండలంలో పత్తి సాధారణ సాగు 685 హెక్టార్లు. అయితే, గతేడాది మంచి దిగుబడులు రావడం, మార్కెట్‌లో ఆశించిన మేర ధర లభించడంతో ఈ సారి పలువురు పత్తి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఉయ్యాలవాడ, హరివరం, ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, కొండుపల్లె, గోవిందపల్లె, కాకరవాడ, సర్వాయిపల్లె, బోడెమ్మనూరు, తదితర గ్రామాల్లో మొక్కజొన్న, మినుము, సోయాబీన్, వేరుశనగ సాగు ప్రారంభమైంది. అయితే, ఆయా పంటలకు సంబంధించిన విత్తనాలు, అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో లభించకపోవడంతో రైతన్నలు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీలుగ విత్తనాలు తప్పా ఇతర ఏ పంట విత్తనాలు, ఎరువులు తమకు రాలేదని ఏఓ రాజేంద్రకుమార్ తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షం

- నీట మునిగిన పంట పొలాలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- కుందూకు భారీగా వరద నీరు



క్రిష్టిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

దొర్నిపాడు/ రుద్రవరం: నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దొర్నిపాడు మండలంలోని క్రిష్టిపాడు గ్రామం సమీపంలో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా నదిలోకి వరదనీరు భారీగా చేరుతుంది. శనివారం మండలంలో 66.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- రుద్రవరం మండలంలో 70.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండురోజులుగా మండలంలో కురుస్తున్న వానలకు పేరూరు,ఎర్రగుడిదిన్నె, చందలూరు, నర్సాపురం, మందలూరు, రెడ్డిపల్లె తది తర గ్రామాల్లో సాగు చేసిన మినుము, మొక్క జొన్న వంటి పంటలు వందలాది ఎకరాల్లో నీట మునిగాయి. మొలక దశలో పంటలు జలమయం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.కొందరు పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పొలాల గట్లకు గండ్లు కొట్టి నిల్వ ఉన్న నీటిని బయటకు పారద్రోలుతున్నారు. ఇలాగే వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



ఎర్రగుడిదిన్నె వద్ద మినుము పొలంలో నిలిచిన వర్షపు నీరు



నర్సాపురం వద్ద నీట మునిగిన మొక్క జొన్న పైరు